క్లుప్తంగా

ఆస్తి పన్నుల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పన్నుల వసూళ్ల వివరాలపై సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: ఆస్తి పన్నుల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అజయ్య సూచించారు. శుక్రవారం కమిషనర్ పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లపై వార్డు సచివాలయాల కార్యదర్శులు, రెవిన్యూ సిబ్బందితో మాట్లాడారు. వార్డుల వారీగా పన్నుల వసూళ్లు ఎంతమేరకు పెండింగ్‌లో ఉన్నాయన్న అంశాన్ని పరిశీలించారు. పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పన్నుల వసూలు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే పన్నుల వసూలు కీలకమన్నారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు.

విలువలతో కూడిన విద్యతోనే సార్థకత



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మోటివేషన్ స్పీకర్ బి.నాగశ్రీ

పాలకొల్లు అర్బన్: విలువలతో కూడిన విద్య నేర్చితేనే సార్థకత లభిస్తుందని మోటివేషన్ స్పీకర్ బాలదారి నాగశ్రీ అన్నారు. పాలకొల్లు పట్టణంలోని ఎస్‌కేపీ అండ్ టీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో బంగారు తల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవీయ విలువలు, చదువుకుంటే కలిగే ప్రయోజనాలు, పెద్దలు, ఉపాధ్యాయులపై విధేయత తదితర అంశాలపై నాగశ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం



ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందించనున్నట్లు పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన శుక్రవారం పూర్వ విద్యార్థులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి ఏ విధంగా సహకరిస్తామనే వివరాలను కళాశాల ప్రిన్సిపాల్‌కి వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు డా.ఎస్‌వీ రంగారావు, ఉపాధ్యక్షుడు వి.నాగరాజు, కార్యదర్శి కె భాగ్యశ్రీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ గంగాభవాని, కోశాధికారి కె.వెంకట నరసింహం పాల్గొన్నారు.

ఎయిడెడ్ సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనుగొండ: ఎయిడెడ్ విద్యా సంస్థల సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబుకు వినతి పత్రం సమర్పించినట్లు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాసవీ మాత ఆత్మర్పణ దినోత్సవం సందర్భంగా పెనుగొండ వచ్చిన సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరించి, వినతి పత్రం సమర్పించినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతంలో బాల బాలికల ఉన్నత విద్యాభివృద్ధి లక్ష్యం 1974లో స్థాపించి 50 ఏళ్ల పూర్తి చేసుకున్న పెనుగొండ ఎస్వీకేపీ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టులు భర్తీ చేయాలని, అన్ ఎయిడెడ్‌గా పని చేస్తున్న ఎయిడెడ్, కాంట్రాక్టు సిబ్బందికి ఎంటీఎస్ స్కేలు వర్తింప చేయాలని, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వర్తింపజేయాలని కోరారు.

రేపు చాంబర్స్ కళాశాలలో టాలెంట్ టెస్ట్

పాలకొల్లు అర్బన్: స్థానిక చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.5వేలు నుంచి రూ.25 వేలు వరకు ఫీజులో రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. చాంబర్స్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి బీసీఏ కోర్సును ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ అనుగృహం ఎప్పుడో?

- నిలిచిపోయిన గృహ నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలపై శీతకన్ను

పాలకొల్లు అర్బన్: ప్రతి పేదవాడికి సొంతింటి కళ నెరవేర్చాలనే లక్ష్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుంది. ప్రభుత్వ తీరుతోజగనన్న లే అవుట్‌లోని గృహ నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు నెలనెలా అందాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా సంక్షేమ పథకాల జాడ లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పేదవాడికి పక్కా గృహం నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాలు భూసేకరణ చేసి ప్రతి పేదవాడికీ సెంటున్నర భూమి చొప్పున రిజిస్ట్రేషన్ చేసి పట్టా అందించింది. అలాగే ఆ పట్టా భూమిలో పక్కా గృహం నిర్మించుకోవడానికి లక్షలాది గృహాలు మంజూరు చేసింది. పక్కా గృహం నిమిత్తం పూర్తి సబ్సిడీతో రూ.1.80 లక్షలు, అలాగే డ్వాక్రా మహిళలకు బ్యాంక్ నుంచి మరో రూ.30వేలు మంజూరు చేసింది. ఈ నిధులతో చాలా మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. మరికొంత మంది బేస్‌మెంట్, స్లాబు స్థాయిలో నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలపై శ్రద్ధ చూపకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి.



ఆగర్తిపాలెంలో సగంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు

నియోజకవర్గంలో గృహాల మంజూరు ఇలా

మండలం	సేకరించిన భూమి (ఎకరాల్లో)	లబ్ధిదారులు	మంజూరైన గృహాలు	పూర్తి చేసినవి	నిర్మాణం మధ్యలో ఉన్నవి
పాలకొల్లు	54.33	2277	330	116	156
పాలకొల్లు అర్బన్	51.15	2765	693	81	375
పోడూరు	36.47	1255	951	278	223
యలమంచిలి	48.07	1705	754	196	281

పాలకొల్లు నియోజకవర్గంలో 190.02 ఎకరాలను భూ సేకరణ చేసి 8004 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. 2728 గృహాలు మంజూరు కాగా 671 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకున్నారు.

ప్రకటనలకే పరిమితం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతీ పేదవాడికి 3 సెంట్లు స్థలం, రూ.4 లక్షల ఇంటి రుణం అందిస్తామంటూ చంద్రబాబునాయుడు ఎన్నికల బహిరంగ సభల్లో హామీ ఇచ్చారు. అయితే భూసేకరణకు సంబంధించి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. భూసేకరణ చేయకుండా ప్రతి పేదవాడికీ 3 సెంట్లు స్థలం ఎలా కేటాయిస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్మాణాలు మధ్యలో ఉన్న ఇళ్లను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు



గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు సకాలంలోనే వారి ఖాతాలో పడుతున్నాయి. బిల్లుల చెల్లింపులకు ఎలాంటి ఆటంకాలు లేవు. మంచి రోజుల కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఈ నెలలో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవడానికి మంచి ముహూర్తాలు చూసుకుంటున్నారు.

– రామాయణం త్రిమూర్తులు, హౌసింగ్ డీఈ, పాలకొల్లు

తూర్పుతాళ్లు తాగునీటి ప్రాజెక్టు పరిశీలన



తూర్పుతాళ్లు తాగునీటి ప్రాజెక్టును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సుబ్బారావు

నరసాపురం రూరల్: ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటి అందించే విషయంలోనూ, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో అలసత్వం తగదని జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు గ్రామాల్లోని తాగునీటి ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్కీముల నిర్వాహణను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆపరేటర్లు ప్రజలకు తాగునీరు అందించేందుకు శ్రద్ధగా పనిచేయాలని సూచించారు. తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి ఎక్కడైనా అవసరమైతే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించమని ఆర్‌డబ్ల్యూఎస్ డీసీ శ్రీనివాసనును ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ లోకేష్, కాంట్రాక్టర్‌లు లోకం వెంకటేశ్వరరావు, చినమిల్లి మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



యలమంచిలి: వాసవీకన్యకాపరమేశ్వరి దేవి పూజలో పాల్గొన్న మహిళలు



పెనుమంట్ర: వాసవీమాతకు ఆలయం వద్ద సారె చీరలు సమర్పిస్తున్న మహిళలు

యలమంచిలి: వాసవీ కన్యక పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం లక్ష్మీపాలెం గ్రూపు ఆర్య వైశ్య సంఘ మహిళలు అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. శిరగాలపల్లి గ్రామంలోని శ్రీ గాయిత్రి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘ భవనంలో అమ్మవారి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి అర్చకులు గుత్తిన నరసింహమూర్తి మహిళలతో ఈ పూజలు చేయించారు. ఈ పూజా కార్యక్రమాలను లక్ష్మీపాలెం సంఘ అధ్యక్షుడు భోగవల్లి సూర్యనారాయణమూర్తి, సంఘ జిల్లా అధ్యక్షులు చిర్లంచర్ల సుబ్రహ్మణ్యం, యలమంచిలి మండల సంఘ అధ్యక్షుడు సమయమంతుల సత్య వెంకట సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.

వాసవీమాతకు సారె, చీరలు సమర్పణ

పెనుమంట్ర: పెనుగొండలోని వాసవీమాత అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం మార్టేరు ఆర్యవైశ్య సేవా సంఘం వాసవీ మహిళా విభాగాల ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మహిళా భక్తులు మార్టేరు నుంచి పెనుగొండ వరకు 3 కిలోమీటర్ల వరకు పాదయాత్రగా వెళ్లి వాసవీ అమ్మవారికి సారె చీరలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా మార్టేరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి అమ్మవారి నామస్మరణలతో ఊరేగింపుగా పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

ఈస్ట్ కుక్కిలేరును ఆధునికీకరించాలి



వేములదీవిలో ఈస్ట్ కుక్కిలేరును రైతులతో కలిసి పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వెస్ట్ గ్రామంలోని మోడిపర్ర నుంచి వేములదీవి ఈస్ట్ వరకూ ఈస్ట్ కుక్కిలేరును తక్షణమే ఆధునికీకరించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వేములదీవి నీటి సంఘం అధ్యక్షులు అడ్డాల శ్రీనివాస్‌లు రైతులతో కలిసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. డ్రైనేజి శాఖ ఏఈ పావణ్యతో కలిసి సమస్యాత్మకంగా ఉన్న ఈస్ట్ కుక్కిలేరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఈ డ్రెయిన్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పలు చోట్ల ఆక్రమణలకు గుర్రై పూడుకుపోయిందని, దీంతో తీరప్రాంతంలో ఉన్న వేలాది ఎకరాలు ఎలాంటి సాగుకు పనికి రాకుండా తయారు కావడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గొందిమూల శివారు మోడిపర్ర నుంచి వేములదీవిఈస్ట్ గ్రామం వరకూ పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలన్నారు. ఈ సందర్భంగా ఏఈ పావణ్య మాట్లాడుతూ ఇప్పటికే ఈస్ట్ కుక్కిలేరు డ్రెయిన్ ఆధునికీకరణకు రూ.46 లక్షలతో అంచనాలు పంపించామన్నారు. రైతుల కోరిక మేరకు మళ్లీ ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు తిరుమాని నాగరాజు, బొక్కా వెంకటేశ్వరరావు, తుమ్మా సూర్యారావు, కవురు శ్రీనివస్ శ్రీరాములు, బొక్కా సత్యనారాయణ, బొక్కా హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల ప్రజల సమస్యలు పరిష్కరించాలి



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పెంద్ర వీరన్న

నరసాపురం రూరల్: సంచార జాతుల ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పెంద్ర వీరన్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కోరారు. శుక్రవారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన వీరన్న తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న సంచార జాతుల సమస్యలపై ఆమెకు వివరించారు. వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సంచార జాతులతో త్వరలోనే ఒక అవగాహన సదస్సును ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కరించే విధంగా కృషి చేస్తామని చెప్పారని వీరన్న తెలిపారు.

వృత్తివిద్యా నైపుణ్యాలపై అవగాహన అవసరం



లంకలకోడేరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వృత్తివిద్యా నైపుణ్యాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పాఠశాల హెచ్‌ఎం పి.రాము సూచించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శివదేవునిచిక్కాల హైస్కూల్ 9,10 తరగతి విద్యార్థులు లంకలకోడేరులోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో గ్రామాలకు విద్యుత్ సరఫరా, అలాగే సబ్ స్టేషన్ సామర్థ్యం, ట్రాన్స్‌ఫార్మర్‌లు, లో వోల్టేజి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు వీఎస్ఎన్ మూర్తి, ఒకేషనల్ ట్రైనర్ పి.సత్యశ్రీ పర్యవేక్షణలో విద్యార్థులు సబ్ స్టేషన్‌ను సందర్శించారు. అసిస్టెంట్ ఇంజనీర్ వై.నారాయణ రావు, కె.శివ తదితరులు విద్యార్థులకు సబ్ స్టేషన్ పనితీరు వివరించారు.

ముదునూరిని కలిసిన ఎంపీపీ గొల్లపల్లి



ముదునూరి ప్రసాదరాజుతో ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు

యలమంచిలి: ఇన్‌చార్జి ఎంపీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గొల్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజును ఆయన స్వగ్రామం కలగంపూడిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు ప్రసాదరాజు శాలువా కప్పి, పూలమాల వేసి అభినందించారు. ప్రసాదరాజును కలిసిన వారిలో ఎంపీటీసీ సభ్యులు దేగల సూర్యప్రభ, కంబాల సత్య శ్రీ, నాయకులు వినుకొండ రవి, పొత్తూరి రంగరాజు, మానుకొండ సోమరాజు, దేగల వెంకటేశ్వరరావు, గొరికాలి తాతాజీ, యన్నాబత్తుల సుధీర్ బాబు తదితరులు ఉన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



పి.విజయదుర్గ

నరసాపురం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ శుక్రవారం విలేకరులకు చెప్పారు. కక్షిదారులు జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. కక్షిదారులకు అవగాహన కల్పించి వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని పోలీసు శాఖ, న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. రాజీ చేసుకోదగిన క్రిమినల్, చెక్‌బౌన్స్, యాక్సిడెంట్ కేసులు పరిష్కరిస్తామని తెలిపారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు



కాంబొట్లపాలెంలో పశువులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి

యలమంచిలి: గత నెల 20న ప్రారంభించిన పశు వైద్య శిబిరాలు శుక్రవారంతో ముగిశాయని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖర రెడ్డి తెలిపారు. మండలంలోని 32 గ్రామాలలో శిబిరాలు ఏర్పాటు చేసి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లకు పరీక్షలు చేసి తగు వైద్యం చేసినట్లు ఆయన చెప్పారు. గుంపర్రు, కాంబొట్ల పాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 68 పశువులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు ఆయన వివరించారు. శిబిరంలో పశు వైద్య సహాయకులు గ్రంధి ధర్మారావు, సతీష్, సురేష్, దుర్గాభవాని, జాజిత, జగన్, సత్యశ్రీ, షబీర, హేమలత, దొరబాబు, వెంకన్నబాబు, తరుణ్, సునంద తదితరులు పశువులకు టీకాలు, మందులు వేశారు.

పాలమూరులో దుప్పట్ల పంపిణీ

పెనుమంట్ర: పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెనుమంట్ర మండల ఆశ్రమ శాఖ ఆధ్వర్యంలో పాలమూరు గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు అందజేశారు. అనంతరం పాలమూరులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కలిదిండి నీలాద్రిరాజు, సత్యవతి బంగారమ్మ, కలిదిండి ప్రభావతి, భూపతిరాజు సుబ్బమ్మ పాల్గొన్నారు.

పద్మజ సేవలు అభినందనీయం



పద్మజ దంపతులను సత్కరిస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ

పాలకొల్లు అర్బన్: నిస్వార్థంగా, నీతి, నిజాయితీగా పని చేసిన ప్రభుత్వ అధికారులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పలువురు వక్తలు అన్నారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన మేడికొండ పద్మజ, కార్మిక సంఘ నేత మేడికొండ శ్రీనివాసచౌదరి దంపతులను స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యేలు అల్లు వెంకట సత్యనారాయణ, డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి, గజల్ మాస్ట్రో డా.గజల శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

పెనుగొండ: ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధంగా ఉన్నామని, దీనిలో భాగంగా ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు శనివారం నైతికత-మానవ విలువలపై పరీక్ష నిర్వహించనున్నట్లు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 3న పర్యావరణ విద్యపై పరీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రెండు పరీక్షలు ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలన్నారు. ఉత్తర్ణులైన విద్యార్థులకే ఇంటర్ సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. అలాగే మార్చి1న ప్రథమ సంవత్సర విద్యార్థులకు, 3న ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు.

నేటి నుంచి వంతులవారీ సాగునీటి సరఫరా



పెనుమంట్ర వద్ద గోస్తనీ పంట కాలువ

పెనుమంట్ర: దాళ్వాసాగులో గోదావరి పశ్చిమ డెల్టా గోస్తనీ పంట కాలువ పరిధిలోని వేల్పూరు నుంచి భీమవరం వరకు 68 వేల ఎకరాల పంట భూములకు ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు వంతుల వారీగా సాగునీరు అందించనున్నట్లు తణుకు నీటిపారుదల శాఖ డీఈఈ కె.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.పాలకోడేరు, భీమవరం, వీరవాసరం, మొగల్తూరు, పెనుమంట్ర, నరసాపురం మండలాలకు చెందిన గ్రామ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సాగునీరు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వంతుల ప్రకారం మొదటి వంతు ఆరో రోజు ఉదయం 6 గంటల నుంచి 2వ వంతుకు మొదటిరోజు సాయంత్రం ఆరు గంటల వరకు మధ్య ఉన్న 12 గంటల కాలంలో సదరు వంతు ప్రారంభించే కాలవలకు నీటి ప్రవాహం నియంత్రించి వాటి నీటి మట్టం స్థిరీకరిస్తామని రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకుని సహకరించాలని ఆయన కోరారు. అలాగే పెనుమంట్ర మండల పరిధిలో ఎస్ ఇల్లిందలపర్రు, మల్లిపూడి, జుత్తిగ, పెనుమంట్ర, భట్లమగుటూరు, పొలమూరు, మాముడూరు గ్రామాలకు ఫిబ్రవరి 1 నుంచి 7 వరకు మొదటి వంతుగాను, 14 నుంచి 20 వరకు రెండోవంతుగానూ, 27 నుంచి మార్చి 5వ తేదీ వరకు 3వ వంతుగానూ, మార్చి 12 నుంచి 18 వరకు 4వ వంతుగానూ, 25 నుంచి 31 వరకు 5వ వంతుగానూ నీటి సరఫరా ఉంటుందని పెనుమంట్ర సెక్షన్ ఏఈ బీవీవీఎస్ నారాయణ తెలిపారు. అదే విధంగా మార్టేరు సెక్షన్ పరిధిలో నర్సాపురం కెనాల్‌కు చెందిన ఇరగవరం, పెరవలి, పెనుగొండ, ఆచంట, పాలకొల్లు, ఓడూరు, పెనుమంట్ర, ఉండ్రాజవరం, తణుకు, మండలాలకు చెందిన గ్రామాలకు ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు 5 వారాల పాటు వంతుల వారీగా సాగునీటి సరఫరా చేస్తామని, ఆయా గ్రామ పంచాయతీలకు వంతులవారీ విధానం గురించి తెలియజేశామని మార్టేరు ఇరిగేషన్ సెక్షన్ ఏఈ జీజే శంకర్ తెలిపారు.